క్లుప్తంగా

శ్రీదుర్గాపీఠంలో పూజలు



కపిలేశ్వరపురం దుర్గాపీఠంలో పూజ చేస్తున్న భాస్కర స్వామీజీ

కపిలేశ్వరపురం: స్థానిక శ్రీ దుర్గాపీఠంలో శని, ఆదివారాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పీఠం నిర్వాహకులు భాస్కర స్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారికి నవధాన్యాలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పీఠం అర్చక బృందం అమ్మవారిని కీర్తిస్తూ భక్తిగీతాలను ఆలపించారు. గ్రామంలోని భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భాస్కర స్వామీజీ మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహం ప్రాశస్త్యాన్ని వివరించారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు



అంగర సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో భరతనాట్యం చేస్తున్న పార్వతి

కపిలేశ్వరపురం: అంగరలోని వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో షష్ఠి ఉత్సవం సందర్భంగా శని, ఆదివారాల్లో ఏర్పాటు చేసిన పలు కళా ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పడమర ఖండ్రిక గ్రామానికి చెందిన చిన్నారి కరుప్రోలు పార్వతి భరత నాట్య ప్రదర్శనకు కళాభిమానులు చప్పట్లు కొట్టారు. చిలుకూరి రామకృష్ణ, కె.గంగన్న కాపు, మూలాస్వామిలతో కూడిన రామబాల భక్తభజన బృందంచే భజన ఆకట్టుకుంది. పెనికేరుకు చెందిన శ్రీలక్ష్మీగణపతి భజన సమాజం, జాదూ రత్న అవార్డు గ్రహీత సీహెచ్ శ్రీరాములు ఇంద్రజాల మ్యాజిక్ షోలు ఆకట్టుకున్నాయి.

రేపటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కాజులూరు: మండల గ్రామాల్లో ఈ నెల పదో తేదీ మంగళవారం నుంచి జనవరి ఎనిమిదో తేదీ బుధవారం వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి.వేగేశ్వరరావు తెలిపారు. కాజులూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ గ్రామ సభల్లో రెవెన్యూ సిబ్బందితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొని రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తారన్నారు. గ్రామాల వారీగా షెడ్యూలు తయారు చేసి సచివాలయాలకు అందజేశామని రైతులు స్థానికంగా జరిగే సదస్సుల్లో పాల్గొని తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు నేటితో ముగుస్తున్న గడువు

మండపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సోమవారంతో గడువు ముగుస్తోందని సహాయ ఓటరు నమోదు అధికారి, మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు తెలిపారు. ఓటరు నమోదు సేవలను పట్టణ వాసులకు స్థానిక మున్సిపల్ కార్యాలయం, మండలంలోని ఓటర్ల కోసం ఎంపీడీవో కార్యాలయంతో పాటు ఎంఈవో కార్యాలయాల్లో సేవలు అందిస్తున్నటు తెలిపారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఫొటో ఓటర్ల జాబితా ముసాయిదాను అనుసరించి ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఫారం -7, సవరణల కోసం ఫారం-8, కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-18 లలో దరఖాస్తులు చేసుకొని అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 697 మంది హాజరు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 697 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ తెలిపారు. డివిజన్ పరిధిలోని చాకలిపేట మున్సిపల్ హైస్కూల్‌లో 232 మంది, కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ హైస్కూల్‌లో 240 మంది, రత్నంపేట మున్సిపల్ హైస్కూల్‌లో 240 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంపు తగదు

కపిలేశ్వరపురం: రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై 9,412 కోట్ల ట్రూ అప్ చార్జీల భారాన్ని మోపడం సరికాదని సీపీఎం సీనియర్ నాయకుడు జిత్తుగ చిన వీర్రాజు ఆదివారం ఓ ప్రకటనలో తప్పుబట్టారు. చార్జీలు పెంచబోమంటూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 150 రోజులకే ప్రజలపై విద్యుత్ చార్జీలను పెంచడం ప్రజా వ్యతిరేకమన్నారు. సంపద సృష్టించి రాష్ట్రాన్ని పాలిస్తానన్నది సీఎం చంద్రబాబు ప్రధాన నినాదంగా ఎన్నికల్లో ప్రచారం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలపై భారాలను మోపడానికి ప్రత్యామ్నాయంగా సంపన్నుల వద్ద పోగుబడిన సంపద నుంచి ప్రభుత్వం తన భారాలను తగ్గించుకోవాలని సూచించారు. కాదని ప్రజలను సమస్యల్లోకి నెట్టితే ప్రజా వ్యతిరేకతకు ఈ ప్రభుత్వం గురికాక తప్పదని వీర్రాజు అన్నారు.

ఎట్టకేలకు జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటు

- రేపు ప్రారంభం
- వర్చువల్‌గా ప్రారంభించనున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- తీరనున్న కక్షిదారుల కష్టాలు

రామచంద్రపురం: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు బెంచ్ ఏర్పాటు ఎట్టకేలకు నెరవేరింది. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కృషి ఫలితంగా రామచంద్రపురం కోర్టుల ప్రాంగణంలో అడిషనల్ జిల్లా, సెషన్స్ కోర్టు బెంచ్‌ను రేపు (ఈ నెల 10) రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాగూర్ వర్చువల్‌గా ప్రారంభించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

బ్రిటిష్ హయాంలో బీజం

పట్టణంలో సబార్డినేట్ కోర్టు బ్రిటిష్ పాలనలో ఏర్పాటయింది. తదనంతరం స్థానిక ప్రజాప్రతినిధుల కృషి ఫలితంగా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 1981లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రామచంద్రపురం పరిసర ప్రాంతాల కక్షిదారులు కోర్టుల్లో తమ సమస్యలను పరిష్కరించుకునే వారు. పీడీఎం, సబ్ కోర్టుల్లో పరిష్కారం కాని సమస్యలను జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోవాల్సి ఉంటుంది. రామచంద్రపురం, అనపర్తి, అలమూరు సబ్‌కోర్టుల పరిధిలోని కేసులకు సంబంధించి అప్పీల్‌ను రామచంద్రపురంలో ఏర్పాటు కానున్న అదనపు జిల్లా, సెషన్స్ బెంచ్ కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం ఉంటుంది. గతంలో ఆయా ప్రాంతాలకు సంబంధించి రాజమహేంద్రవరం వెళ్లి అక్కడ ఉన్న జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోవాల్సి వచ్చేది. రామచంద్రపురంలో జిల్లా కోర్టు ఏర్పాటు కోసం నాలుగు దశాబ్దాలుగా పాటు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న పీడీఎం కోర్టు ప్రాంగణంలో జిల్లా కోర్టును ఏర్పాటు చేసి, పీడీఎం కోర్టును బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



జిల్లా, సెషన్స్ కోర్టు బెంచ్ నిర్వహించనున్న కోర్టు ప్రాంగణం

ప్రారంభానికి కోర్టు ప్రాంగణం సిద్ధం

అడిషనల్ జిల్లా కోర్టును ప్రారంభించేందుకు స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లను చేశారు. ఈనెల 10 ఉదయం 10.15 నిమిషాలకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో పాటుగా హైకోర్టుకు చెందిన మరో ఆరుగురు న్యాయమూర్తులు అడిషనల్ జిల్లా, సెషన్స్ కోర్టు బెంచ్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ముఖ్యఅతిథులుగా ఇప్పటికే సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణాన్ని అడిషనల్ జిల్లా కోర్టు బెంచ్ కోసం సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత హాజరు కానున్నారు.

8 మండలాలకు సౌలభ్యం

రామచంద్రపురంలో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు బెంచ్ ఏర్పాటు చేయటం మూలంగా 8 మండలాల ప్రజలకు సౌలభ్యంగా ఉటుంది. రామచంద్రపురం పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, మండపేట, అనపర్తి కోర్టు పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, ఆలమూరు మండల కక్షిదారులకు రాజమహేంద్రవరం జిల్లా కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ మేరకు జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా చర్యలు ముమ్మరం చేస్తున్నారు. రామచంద్రపురంలో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పరిధిలోని మండలాలకు సంబంధించిన రికార్డులను బదిలీ చేసేందుకు సిద్ధం చేయాలని జిల్లా కోర్టు జడ్జి ఉత్తర్వులను జారీ చేశారు. అతి త్వరలోనే ఎన్నో ఏళ్లుగా ఆశిస్తున్న జిల్లా కోర్టు బెంచ్ రామచంద్రపురం ప్రస్తుతం ఉన్న కోర్టుల ప్రాంగణంలో ఏర్పాటు కానుండటంతో అటు కక్షిదారులు ఇటు న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో ఏళ్ల కృషి ఫలించింది



కింద కోర్టులో కేసులను జిల్లా కోర్టులో అప్పీలు చేసుకునేందుకు రాజమహేంద్రవరం వెళ్లాల్సి వచ్చేది. దాని మూలంగా కక్షిదారులతో పాటుగా న్యాయవాదులకు ఇబ్బందులుండేవి. రామచంద్రపురంలో జిల్లా కోర్టు ఏర్పాటు మూలంగా కక్షిదారులకు, న్యాయవాదులకు సమయం కలిసి వస్తుంది. గత నాలుగు దశాబ్దాలుగా జిల్లా కోర్టు కోసం ఎదురు చూస్తున్నారు. బార్ అసోసియేషన్ తరఫున అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– పి.మురళీమోహన్ వెంకటరమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

యువ న్యాయవాదులకు పునాది



రాబోయే కాలంలో యువ న్యాయవాదులకు ఈ బెంచ్ ఏర్పాటు చేయటం వలన మంచి భవిష్యత్ ఉంటుంది. మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కృషి ఫలితంగానే ఈ కోర్టు ఏర్పాటు అయ్యింది. 30 ఏళ్ల న్యాయవాదులు, కక్షిదారుల పోరాటం సఫలీకృతం అయింది. న్యాయవాదులు, కక్షిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– వాద్రేవు సాయిప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

కల్వర్టు రక్షణ గోడలకు పగుళ్లు



దెబ్బతిన్న కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయం ఎదుటి కల్వర్టు రక్షణ గోడలు

కపిలేశ్వరపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఎదుట ఉన్న కల్వర్టు రక్షణ గోడకు పగుళ్లు ఏర్పడ్డాయి. గోడ పైభాగం ఊచలు ఛిద్రమై ఊడిపడ్డాయి. కార్యాలయంలో సమావేశాలు నిర్వహించినపుడు సందర్శకులు కల్వర్టు వద్ద నిలబడి వేచి చూస్తుంటారు. రక్షణ గోడలను పటిష్ఠపరచాల్సిన అవసరం ఉంది. కార్యాలయం ఎదుట ఆర్అండ్ బీ రహదారి ఛిద్రమైంది. గుంతలు పడి రాళ్లుపైకి రేగి ఉన్నాయి. మండల కేంద్రం నుంచి నియోజకవర్గ కేంద్రమైన మండపేట, రావులపాలెం, రాజమహేంద్రవరం, కాకినాడకు ఈ రహదారి మీదుగా ప్రయాణాలు సాగిస్తుంటారు. కపిలేశ్వరపురం నుంచి అంగర గ్రామ శివారు వరకూ రహదారి ఛిద్రమైంది. మరమ్మతు చేపట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ప్రమాద బాధితుడికి సాయం



బాలుడి తండ్రి దుర్గాప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ వేడి నీళ్లు పడటంతో శరీరం కాలిపోయిన బాలుడికి స్థానిక కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులు రూ.12,500 చెక్కును ఆదివారం సాయంగా అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన కుశాల్ కుమార్ అనే పదకొండు నెలల చిన్నారికి ఒంటి మీద వేడి నీళ్లు పడటంతో శరీరం అంతా కాలిపోయింది. ఆరు నెలల పాటు చికిత్స అందించాల్సిన పరిస్థితి ఉందని వైద్యులు తెలిపారు. అయితే ఆర్థిక స్తోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణదేవి సేవా సంస్థ సభ్యులను చిన్నారి తండ్రి నూతి దుర్గాప్రసాద్ సాయం కోరారు. దీంతో రూ.12,500 చెక్కును బాధితుడి తండ్రికి సభ్యులు అందజేశారు.

కుట్టు మెషీన్ అందజేత

రావులపాలెం: స్థానిక సమతా పరిషత్ సభ్యులు ఆదివారం ఒక మహిళకు కుట్టుమెషీన్ అందజేశారు. ఏ ఆధారం లేకుండా నిరాశ్రయులైన కపిలేశ్వరపురం మండలం నేలటూరికు చెందిన చిట్టంశెట్టి రాధాచంద్ర కనకదుర్గ అనే మహిళకు పరిషత్ సభ్యులు కుట్టుమెషీన్‌ను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ గోపాల్‌రెడ్డి, సిద్ధాని తాతారావు, ఎస్‌వీఆర్ కృష్ణారెడ్డి, సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై ధాన్యం రాశులు



కపిలేశ్వరపురం-అంగర రహదారిపై ఆరబెట్టిన ధాన్యం

కపిలేశ్వరపురం: అల్పపీడనం ప్రభావం తగ్గడంతో వ్యవసాయ క్షేత్రాల్లో భద్రపరుచుకున్న ధాన్యాన్ని రైతులు రహదారులపై ఆరబెట్టుకుంటున్నారు. వర్షాల సమయంలో కోతలు కాని పంటను రైతులు అప్రమత్తమై కోస్తున్నారు. 90 శాతం వరి కోతలు పూర్తికావడంతో వరికోత యంత్రాలు సైతం అందుబాటులో లేవు. దీంతో ఆ సమయంలో కోతలు కోయని రైతులు కూలీలతో వరి పంటను కోస్తున్నారు. ధాన్యాన్ని మాసూలు చేసి మిల్లులకు తరలించుకునేందుకు ఉపక్రమించారు. మరో అల్పపీడనం ఉందంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో మాసూళ్ల పనులను యుద్ధ ప్రాతిపదికన చేసుకుంటున్నారు. తేమ శాతం ఖచ్చితంగా 17 శాతానికి లోపు ఉండాలన్న ప్రభుత్వ నియమం మేరకు రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సన్నాలు పండించిన రైతులు స్వర్ణ రకం ధర మాత్రమే సన్నాలకూ ఇస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. స్వర్ణరకం కంటే సన్నాలు దిగుబడి సహజంగా తక్కువ ఉంటుంది. దిగుబడి సమస్య నుంచి బయడ పడాలంటే ఖచ్చితంగా సన్నాలుకు ధర ఎక్కువ ఉండాలి. అందుకోసం సన్నాలు సాగు చేసిన రైతులు తమ ధాన్యాన్ని భద్రపర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

నేటి నుంచి ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె

మండపేట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది సోమవారం నుంచి సమ్మెబాట పడుతున్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా టెంట్ వేసి సమ్మెకు ఉపక్రమిస్తున్నామని యూనియన్ ప్రెసిడెంటు పి.సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శి పాలచర్ల లీలాకృష్ణ ఆదివారం తెలిపారు. రాష్ట్ర ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మండపేటలో కూడా చేపడుతున్నట్టు వారు తెలిపారు. టెక్నికల్ ఇంజినీరింగ్ వర్కర్స్ వేతనాన్ని నెలకు రూ.29200, నాన్ టెక్నికల్ ఇంజినీరింగ్ వర్కర్స్‌కు రూ. 24500 పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. 15 ఏళ్లకు పైగా ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న సిబ్బంది సర్వీసులను క్రమబద్ధీకరించాలని వారు కోరుతున్నారు. అలాగే డిమాండ్ నోటీసులో ఇచ్చిన విధంగా సెలవు దినాలు కూడా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. విధుల్లో మరణించిన వారి కుటుంబానికి రూ.10 లక్షలు, అంగవైకల్యం వాటిల్లిన వారికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అమలు చేయాలని డిమాండు చేశారు. తాము కూడా కార్మికులు లెక్కలోకి వస్తున్నందున ప్రభుత్వ తమకూ వర్తింపజేయాలని కోరారు. పైన పేర్కొన్న ప్రధాన డిమాండ్ల సాధనకోసం రాష్ట్ర కమిటీ పిలుపుతో సమ్మె చేపడుతున్నామని వారు తెలిపారు. సహాయ కార్యదర్శులు యాదాల తాతారావు, జీవీ ప్రసాద్, పి. రాజేష్, ఉపాధ్యక్షుడు వై. తాతారావు, కోశాధికారి టీకే వెంకన్న, పి.రవికిరణ్, కోఆర్డినేటర్ జి. అశోక్, పాలపర్తి సురేష్‌కన్నా పాల్గొన్నారు.



సమ్మెకు పిలుపునిచ్చిన మండపేట ఔట్ సోర్సింగ్ సిబ్బంది

భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో విజేతలు వీరే



విజేతలకు బహుమతులు అందిస్తున్న న్యాయనిర్ణేతలు

మండపేట: గీతా జయంతిని పురస్కరించుకుని పట్టణంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) హిందూ ధర్మ ప్రచార పరిషత్ రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో స్థానిక జేసీ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ఆదివారం ఈ పోటీలు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ జేసీ ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన శ్లోక కంఠస్థ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి మహిళలు, బాలికలు పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. మహిళా విభాగం నుంచి కొత్తపేటకు చెందిన ఎస్.భార్గవి ప్రథమ బహుమతి గెలుచుకోగా, పట్టణానికి చెందిన ఎస్. రమాదేవి ద్వితీయ, అమలాపురానికి చెందిన ఎస్. నాగలక్ష్మి తృతీయ బహుమతి గెలుచుకున్నారని కాలేజీ ప్రిన్సిపాల్ జేసీ ప్రసాద్ వివరించారు. అలాగే బాలికల విభాగంలో కొత్తపేట నుంచి వచ్చిన ఎం. దీక్షిత ప్రథమ స్థానం, తాటిపాకకు చెందిన టి.లక్ష్మీప్రియ ద్వితీయ, రావులపాలెంకు చెందిన ఎస్. స్కంధ తృతీయ స్థానాలు సాధించినట్టు తెలిపారు.టి. లక్ష్మి, గుణ్ణం సత్య, వాకచర్ల వాసంతిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వారిని ప్రిన్సిపాల్ జేసీ ప్రసాద్ అభినందించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణ చేస్తే సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా ఎదగడానికి అవకాశం.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



ద్వారపూడి, యానాం రోడ్డులో కాజులూరు మండలం కోలంక వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

కాజులూరు: మండలంలోని ద్వారపూడి, యానాం రహదారిలో కోలంక వద్ద ఉన్న మలుపులో ప్రమాదాల నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. స్థానిక హైస్కూల్ సమీపంలో పాలమూరుపాడుకు వెళ్లే రహదారి వద్ద ఉన్న ఈ మలుపులో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక్కడ మలుపు ఇరుకుగా ఉండటానికి తోడు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఉండటంతో వాహనాలు అదుపుతప్పి వాటిని ఢీకొడుతున్నాయి. దీంతో సగటున నెలకు రెండు నుంచి మూడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు మత్యువాత పడిన సంఘటనలు ఉండగా ఎందరో క్షతగాత్రులయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో మలుపు వద్ద రోడ్డును వెడల్పు చేసి విద్యుత్ స్తంభాలను మార్పు చేయాలని, హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు గత కొన్నేళ్లుగా మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మండపేట మున్సిపల్ అధికారులు

కమిషనర్	9849905809
మేనేజర్	9849908186
డీఈ	9849769340
ఏఈ	9849906527
ఆర్వో	9849743832
ఆర్ఐ	7702155588
టీపీవో	9849986208
ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్	9849986209
ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్	9849639629
జేడీ పశు సంవర్ధక శాఖ	8985488562
హౌసింగ్ డీఈ	7093930423
హౌసింగ్ ఏఈ టౌన్	7093930491
రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్	9440796537
టౌన్ ఎస్సై	8332957926
లేబర్ ఆఫీసర్	9492555059
ఫైర్ ఆఫీసర్	9963727741
ఇన్‌చార్జ్ ఆర్టీవో	9154294653
పోస్టుమాస్టర్	08855231890
ఎక్సైజ్ సీఐ	9440902412
సబ్ రిజిస్ట్రారు	7093921407

మళ్లీ మళ్లీ.. అదే తప్పే



వెంకటాయపాలెంలో ఆదివారం పంట పొలానికి నిప్పుపెట్టిన రైతు

- పంట చేలకు నిప్పు పెడుతున్న రైతులు
- వద్దని హెచ్చరిస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వరి కోతలు కోత మెషీన్ల పుణ్యమా అని త్వరగా పూర్తవుతున్నాయి. అయితే కొంతమంది రైతులు అవగాహన రాహిత్యంతో కోత మిషీన్ల వల్ల చేలల్లో మిగిలిపోయిన గడ్డికి నిప్పు పెడుతుండటంతో మిగిలిన రైతులకు శాపంగా మారుతోంది. వారు మా చేలో గడ్డికి నిప్పు పెట్టుకుంటున్నాం అని అనుకుంటున్నారు. కానీ అది ఒక చేను నుంచి మరో చేనుకు పాకుతూ ధాన్యం నిలువ చేసిన రైతులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. తమ పొలాలలో,

నియోజకవర్గం	వరి పంట (ఎకరాల్లో)	గత ఏడాది చేలకు నిప్పు పెట్టిన సంఘటనలు
రామచంద్రపురం	51,948	48
మండపేట	47,076	39

చేల గట్లమీద నిల్వ చేసిన ధాన్యం రాశులకు ఎక్కడ నిప్పు అంటుకుంటుందోనని నానా హైరానా పడాల్సి వస్తుంది. ఉరుకులు పరుగుల మీద తమ ధాన్యపు రాశులను కాపాడుకోవడానికి బకెట్లు, బిందెలతో నీళ్లతో తడుపుకుంటూ నానా ప్రయాస పడాల్సి వస్తుంది. మరోపక్క ఫైర్ సిబ్బందికి కూడా స్థిమితం లేకుండా చేస్తున్నారు. ఒకే రోజు పలుచోట్ల రైతులు తమ పొలాల్లోని గడ్డికి నిప్పు పెడుతుండటంతో ఎటు వెళ్లాలో తెలియక తలపట్టుకుంటున్నారు. అప్పటికీ రామచంద్రపురంలోని ఫైర్ సిబ్బంది ఒకచోటుకి వెళ్లినా మిగిలిన చోట్లకు మండపేట, జగన్నాథపురం ఫైర్‌స్టేషన్ల నుంచి వాహనాలను, సిబ్బందిని రప్పిస్తున్నారు. ఇలా చేలల్లో నిప్పు పెట్టడం గత ఆరేళ్ల నుంచి రైతులు మొదలుపెట్టారు. వరికోత యంత్రాలతో కోతలు అయిపోయాక మిగిలిన గడ్డిని తీయించడం ఖర్చుతో కూడుకున్న పని కావడం, గత పంటల తాలూకా కేళీలు తరువాతి పంటలో ఇబ్బందులు తలెత్తుతాయనుకోవడంతో రైతులు ఈ విధంగా చేస్తున్నారు. అయితే చేలల్లో నిప్పు పెట్టడం వల్ల పంట పొలాల భూముల్లోపలి రైతులకు మేలు చేసే సూక్ష్మ క్రిములు నశించిపోతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కొందరు రైతులు పెడుతున్న నిప్పు వల్ల విద్యుత్ వైర్లకు కూడా డ్యామేజీ జరుగుతుందని విద్యుత్ అధికారులు అంటున్నారు. గతంలో చేలల్లో నిప్పు పెట్టడం వల్ల కొంతమంది రైతుల ధాన్యపు రాశులు కాలిపోయాయి.

వరి పొలాల్లో నిప్పుతో నష్టమే ఎక్కువ



వరి పొలాల్లో ప్రస్తుతం నిప్పు పెట్టడం వల్ల ఉపయోగం ఏమీలేదు. పైగా దానివల్ల నష్టమే ఎక్కువ. మట్టిలో ఉండే రైతులకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. ప్రకృతికి కూడా హాని చేసినవారవుతారు. నిప్పు పెట్టడం వల్ల విషవాయువులు వ్యాప్తి చెందుతాయి. వాతావరణంలో వేడి పెరిగిపోతుంది. కోతలు కాగా మిగిలిన గడ్డిని పొలాలలోనే కలసిపోయేలా దుక్కు చేసుకుంటే మంచిది. అంతేకాని రైతులు ఎవరూ పొలాల్లో నిప్పుపెట్టవద్దు.

– ఎస్.సత్యప్రసాద్, ఏవో, రామచంద్రపురం

పక్క రైతుల గురించి ఆలోచించండి



కొందరు రైతులు కేవలం తమ పొలంలో గడ్డికి మాత్రమే నిప్పు పెడుతున్నాం అనుకుంటున్నారు. కానీ మంటలు చాలా వేగంగా వ్యాపించి పక్క చేలల్లో నిల్వ చేసుకున్న ధాన్యపు రాశులు కాలిపోతున్న సంఘటనలు గత ఏడాది చోటు చేసుకున్నాయి. ఈ విధంగా నిప్పు పెట్టడం వల్ల జరిగే మేలు ఏమీ లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నది గమనించుకుని రైతులు దయచేసి చేలల్లో నిప్పు పెట్టవద్దని కోరుతున్నాం.

– సంసాని నాగేశ్వరరావు, ఫైర్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రపురం